ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 27 | ఏప్రిల్ | 2024 పేజీలు 8

# 45 మంది అభ్యర్థులు..
# 72 నామినేషన్లు

**-నాలుగు నామినేషన్లు తిరస్కరణ**
**-పూర్తయిన పరిశీలన**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో రెండవ అంకం శుక్రవారం పూర్తయింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్ నేతృత్వంలో నామినేషన్లను పరిశీలించారు. మొత్తం 45 మంది అభ్యర్థులు 72 నామినేషన్లను దాఖలు చేశారని ఇందులో నలుగురు అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసి బీఫాం అందజేయని పోట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, నాగా సీతారాములు తో పాటు ఉల్లంగుల యాదయ్య నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం 41 మంది అభ్యర్థులు ఉన్నారని ఈనెల 29న సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. 29వ తేదీ ఉపసంహరణ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి విపి గౌతమ్ మాట్లాడుతూ ఇప్పటికే ఓటరు స్లిప్పుల పంపిణీ మొదలైందన్నారు. ఇవిఎంల కేటాయింపు కూడా పూర్తయిందని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం వచ్చే నెల మూడు నుంచి ఎనిమిది వరకు జరుగుతుందన్నారు. ఇంటి వద్ద ఓటు వేసేందుకు 2930 మంది దరఖాస్తు చేశారని గౌతమ్ తెలిపారు.

**ఆధారం లేకుండా నగదు తరలించ వద్దు : సిపి సునీల్ దత్**

ఆధారం లేకుండా నగదు తరలించి ఇబ్బందులు పడవద్దని సిపి సునీల్ దత్ తెలిపారు. రూ. 50వేల కంటే ఎక్కువగా నగదును తీసుకు పోకూడదని ఆయన తెలిపారు. డబ్బులు తీసుకుపోయే వారు అన్ని ఆధారాలు తమ వెంట ఉండాలని లేని పక్షంలో నగదును సీజ్ చేస్తామని తెలిపారు. చెక్ పోస్టులలో జరిగిన సోదాలలో ఇప్పటి వరకు రూ. 100,59,130 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. రూ. 47,36,883 నగదును సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

# దౌర్జన్యంగా ఇల్లు కూల్చివేత



- మహిళలపై దాడి
- నలుగురిపై కేసు నమోదు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన సిపి సునీల్ దత్

వివరాలు.. 2లో




- పల్లెల్లో పనులు కరువు
- ఉపాధి హామీ పనులవైపు చూపు
- పెరిగిన కూలీ రేటు
- జిల్లా వ్యాప్తంగా

2 లక్ష 29 వేల జాబ్ కార్డులు

2లో






# దౌర్జన్యంగా ఇల్లు కూల్చివేత





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలో మళ్లీ భూ వివాదాలు క్రమ క్రమేపి పెరుగుతున్నాయి. అక్రమ రిజిస్ట్రేషన్లు ఈ వివాదాలకు కారణమవుతున్నాయి. అక్రమ వ్యాపారాలతో కోట్లు గడించిన కొందరు దౌర్జన్యాలకు పాల్పుడుతున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. మాజీ ప్రభుత్వ ఉద్యోగి పదుల సంఖ్యలో తన అనుచరులను వెంటేసుకుని వెళ్లి మహిళలపై దౌర్జన్యం చేయడమే కాకుండా ప్రోక్లెన్లతో ఇల్లు కూలగొట్టిన ఘటన శుక్రవారం ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. బాధితురాలు చేపూరి పద్మ తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీ రోడ్డు నెం.15లో చేపూరి కృష్ణ అనే వ్యక్తి సర్వే నెంబరు 494లో 272 గజాల స్థలం కొని రేకుల షెడ్డు నిర్మించారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేసే చేపూరి కృష్ణ 2018లో మరణించగా ఆయన భార్య పద్మ కుమార్తెలతో కలిసి ఆ ఇంట్లో ఉంటుంది. ఈ ఇంటి స్థలం తనది అని కూనా గోవిందరావు అనే వ్యక్తి పలుమార్లు దౌర్జన్యం చేసే పని చేశారని మేము న్యాయస్థానాన్ని ఆశ్రయించగా న్యాయస్థానాలు సైతం తమకు అనుకూలంగా తీర్పునిచ్చాయని పద్మ తెలిపారు. న్యాయస్థానం మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం కూనా గోవిందరావు, వాసిరెడ్డి శ్రీనివాసరావు, మిట్టపల్లి వెంకటేశ్వర్లు, రమణ యాదవ్ అనే వ్యక్తులు తమ ఇంటిపై పడి దౌర్జన్యంగా ఇల్లు కూల్చివేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తె ఇటీవల డెలివరి అయిందని పసిపాప ఇంట్లో ఉందని బతిమిలాడిన వినకుండా దౌర్జన్యం చేశారని ఆమె తెలిపారు. ఈ విషయమై తాము ఖమ్మం హవేలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. గ్యాస్ లీక్ చేసి ఇంట్లో ఉన్న సామాన్లను చిందర వందర చేశారని, సెల్‌ఫోన్ సైతం పగలగొట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రక్షణ లేదని తమకు రక్షణ కల్పించాలని ఆమె కోరారు. ఘటన స్థలాన్ని ఖమ్మం నగర పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శుక్రవారం పరిశీలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దౌర్జన్యంగా ఇంటిని కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రేగా



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు గ్రామంలో కాకాని రాంబాబు, రమణ దంపతుల కుమార్తె మౌనిక వెడ్స్ నరసింహారావుల వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రభుత్వ విప్, మాజీ శాసన సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలతలు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, తెలంగాణ ఉద్యమ కారులు పోడియం నరేందర్, పార్టీనాయకులు భూక్య శ్రీను, నరసింహారావు, వారి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు సుధాకర్ రాజీనామా



**ప్రజాపక్షం/ములకలపల్లి:** బిఆర్ఎస్ పార్టీ ములకలపల్లి గ్రామ కమీటీ అధ్యక్షులు బిక్కుమళ్ళ సుధాకర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం రాజీనామా పత్రాన్ని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావుకు పంపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్ది కాలంగా ములకపల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షునిగా పని చేస్తున్నానని, గత కొద్ది కాలంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మోరంపూడి అప్పారావు ప్రవర్తన నచ్చక శుక్రవారం పార్టీసభ్యత్వానికి, ములకపల్లి బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుని పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు.

# ఉపాధి పరుగు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని పల్లెల్లో పనులు తగ్గుముఖం పట్టడంతో ప్రజలంతా ఉపాధి పనుల వైపు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో చేపట్టే పనులకు ఉపాధీ హామీ జాబ్‌కార్డు దారుల హాజరు శాతం పెరిగింది. కొత్త ఆర్థిక సం. మొదలు కావడం, కొత్త పనులు పెరగడంతో అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆర్థిక సం.కు గానూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ కూలీ రేటు పెంచడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఉపాధి పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లోనే పనులు కల్పించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం చెరువుల పూడిక తీతలు, ఇంకుడు గుంటలు తదితర పనులు చేస్తుండగా వీటితో పాటు మరి కొన్ని పనులను గుర్తించి పనులు కల్పించేందుకు అనుమతులు కోసం అధికారులకు ఫైళ్లు సమర్పించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల మందికి పైగా హాజరువుతున్నారు. పనులు పెరుగుతున్న నేపథ్యంలో మరింత మంది ఎక్కువగా హాజరయ్యే అవకాశం ఉండటంతో పనులు జరిగే ప్రాంతాల్లో సదుపాయాలు కూడా కల్పిస్తున్నారు.

**ఉపాధి చూపు...**

జిల్లావ్యాప్తంగా వేసవి కాలంలో ఉపాధి పనుల వైపు జనం మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో పాటు మర్చి కోతలకు ఇతర రాష్ట్రాల నుండి జనాలను రైతులు తెచ్చుకుంటుండటంతో స్థానిక వ్యవసాయ కూలీలకు పనులు కరువయ్యాయి. దీంతో అంతా ఉపాధి పనుల చేసేందుకు సిద్ధపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 29వేల జాబ్ కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 3 లక్షల 60 వేల మంది వరకు నమోదై ఉన్నారు. ప్రతీ ఏటా వీరిలో సుమారు 70 వేల నుండి 80 వేల మంది పనుల్లో పాల్గొంటున్నారు. కుటుంబంలో ఉన్న వారందరికీ స్థానికంగా పనులు లభ్యం కావడంతో ఎక్కువ మంది పట్టణాలకు పనులకు వెళ్లకుండా గ్రామాల్లోనే పనులు చేసుకుంటూ సంపాదించు కుంటున్నారు.

**పెరిగిన కూలీ రేట్లు ...**

కేంద్రప్రభుత్వం ఉపాధి హామీ కూలీ రేట్లను ఈ ఆర్థిక సం. నుండి పెంచింది. గత ఏడాది గరిష్టంగా కూలీ రేటు రోజుకు రూ.272 ఉండేది. గత ఏడాదికి సంబంధించిన కూలీలను ఇప్పటికే చెల్లించారు. 20242025 ఆర్థిక సం.కు గానూ దానిని సడలించి రూ.300 గరిష్ట వేతనాన్ని చేశారు. దీంతో జనం ఉపాధి పనులు చేసేందుకు క్యూ కడుతున్నారు. వీరందరికీ పనులు కల్పించేందుకు అధికారులు నూతన పనులకు శ్రీకారం చుడుతున్నారు. రానున్న వ్యవసాయ సీజన్‌లో నీటి కాలువల్లో నీరు సజావుగా పారేందుకు పూడిక తీతలు తీసే పనులు మొదలు పెడుతున్నారు. అటవీ ప్రాంతాల్లోనూ, గ్రామాల్లోను కందకాలు తవ్వడంతో పాటు, గ్రామాల్లో నీటి నిల్వలు పెంచేందుకు ఇంకుడు గుంటలు తీసేలా ఉపాధి పనులు కల్పిస్తున్నారు.

**గత ఏడాది రూ.100 కోట్ల పనులు...**

20232024 ఆర్థిక సం.కు గానూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.100 కోట్ల ఉపాధి పలనులను కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఈ పనుల్లో సుమారు 70 వేల నుండి 80 వేల మంది వరకు పాల్గొని కూలీలు పొందారు. ఈ నూతన ఆర్థిక సం.లో కూడా జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ పనులు కల్పించటమే లక్ష్యంగా అధికారులు ప్రమాళికలు సిద్ధం చేశారు. ప్రతీ రోజూ పనులకు వచ్చే కూలీలను గుర్చిండంతో పాటు ఎన్ఐసి రూపొందించిన ఎన్ఎంఎంఎస్‌లో వారి పని వివరాలను నమోదు చేస్తున్నారు. పని వివరాలు ఎప్పటికప్పుడు సాఫ్ట్‌వేర్‌లో పొందు పరిస్తేని వేతనాలు అందుతున్నాయి. వీరి చేసే పనులకు మెటీరియల్ కంపోనెంట్ క్రింద నిధులు వస్తుండటంతో వాటిని గ్రామపంచాయితీల పరిధఇలో వినియోగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ ఎండా కాలం ఎంత మంది పనులకు వచ్చినా కల్పించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

## తేనెటీగల పెంపకంపై అవగాహన



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి లో గ్రామీణ ప్రాంత యువత నైపుణ్య శిక్షణ కార్యక్రమంను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో తేనెటీగల పెంపకం, తేనెటీగల పెంపకానికి అనువైన ప్రదేశంను, వాటి పెంపకానికి అనువైన పంటలను తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఇద్దరు రైతుల చోప్పున యువకులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, టెక్ ఏడిఏ లాల్‌చంద్, ఏఈవోలు దీపక్, అశోక్, కారుణామయి, సేంద్రిక వ్యవసాయ రైతు చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌పి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు సభ్యులు




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిషేదిత మావోయిస్టు పార్టీకి చెందిన మిలీషియా కమాండర్, డిఏకెఎంఎస్ సభ్యురాలు ఏఎస్‌పి పారితోష్ పంకజ్ ఎదుట స్వచ్ఛందంగా శుక్రవారం లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల నెమలిగూడ ప్రాంతానికి చెందిన పొడియం ఇడుమయ్య అలియాస్ హరీష్, అదే ప్రాంతానికి చెందిన ముత్యాలక్క ఉన్నారు. ఇప్పటికే పలువురు ఆపరేషన్ చేయూత లో భాగంగా భద్రాచలం ఏఎస్‌పి ఎదుట లొంగిపోతున్నారు.

# బోన్ మ్యారో సర్జరీతో తలసేమియాకు చెక్



**-ఎనిమిది మంది చిన్నారులకు చికిత్స విజయవంతం**
**-ప్రముఖ వైద్యులు విజయ్, నారాయణమూర్తి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు బోన్ మ్యారో సర్జరీతో ఉపశమనం కల్పించవచ్చునని ప్రముఖ వైద్యులు ఎం. విజయ్, డి. నారాయణమూర్తి లు తెలపారు. మహబూబాబాద్ జిల్లా నర్సన్నపేటకు చెందిన జి. విక్షిత్ (హెచ్ఎల్ఏ హాఫ్ మ్యాచ్), ఖమ్మంకు చెందిన జే. ఝాన్సీ (హెచ్ఎల్ఏ ఫుల్ మ్యాచ్) చిన్నారులకు బోన్ మ్యారో చికిత్స విజయవంతమై ఖమ్మంకు తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు వారికి స్వాగతం పలికారు. చిన్నారులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వైద్యులు విజయ్, నారాయణ మూర్తి లు మాట్లాడుతూ హెచ్ఎల్ఏ ఫుల్ మ్యాచ్‌తో పాటు హాఫ్ మ్యాచ్‌తో కూడా సర్జరీలు విజయవంతం కావడం చిన్నారుల అదృష్టమన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ చిన్నారులను తలసేమియా ఫ్రీ గా మార్చడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంకల్ప సంస్థ బాధ్యులు రవిచందర్ మాట్లాడుతూ బెంగళూరు సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో తమ సంస్థ చిన్నారులకు బోన్ మ్యారో చికిత్స చేయిస్తుందని ఇప్పటి వరకు ఎనిమిది మంది చిన్నారులు తలసేమియా ఫ్రీ గా మారారని ఆయన తెలిపారు. తలసేమియా రహిత సమాజం కోసం తమ సంస్థ చేస్తున్న కృషితో అడుగులు పడుతున్నాయని వ్యాధి నిర్మూలనకు మరింత ఉత్సహంగా పని చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో తలసేమియాతో చిన్నారులు జన్మించవద్దనేదే తమ సంస్థ లక్ష్యమని అందు కోసం ఆ వ్యాధి పై విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పావని, పి. ఉదయ్ భాస్కర్, పి. అనిత, ఎన్. ఉపేందర్, తలసేమియా చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోనాయిగూడెం పంచాయతీ కార్యదర్శి బోళ్ల వీరబాబు సూచించారు. మండలం లోని కోనాయిగూడెం లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల మస్టర్ల ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....ఉపాధి కూలీలు ఎండ దెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూలీలు ఉదయం 6 గంటలకే పని వద్దకు రావాలని సూచించారు. కూలీలు సంఖ్య ను మరింత పెంచే విధంగా మేట్‌లు కూలీలను పెంచాలని సూచించారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున్న ఓఆర్ఎస్ ప్యాకెట్ల ను సిద్దంగా ఉంచుకోవాలని అన్నారు. తాగునీటి ఎక్కువగా తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, పంచాయతీ ఉపాధి క్షేత్ర సహాయకులు తిగుళ్ల భాస్కర్, సహాయకులు వడ్ల



మూడి శ్రీనివాసరావు, సమాఖ్య అధ్యక్షురాలు కుమ్మరి నాగమణి, పి.మాధవి, బాలస్వామి,తిరపయ్య, వెంకటరమణ , వుల్లోజి రమ్య, బిందె వీరబాబు, భవాని, పద్మ, నాగరాణి, సుశీల, దేవకర్ణ , ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నెకల్‌పంచాయతీ పరిదిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో లోక్‌సభ సాధరణ ఎన్నికలు2024ను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రిసెప్షన్,కౌంటింగ్ కేంద్రాలను ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ సాధరణ పరిశీలకు డాక్టర్ సంజయ్‌గేంద్రాజ్‌కోల్టే, పోలస్ పరిశీలకు చరణ్‌జీత్ సింగ్లు జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్,పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అన్ని బ్లాకుల గదలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఎన్నికల అధికారులకు సూచించారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలు భద్రపర్చడానికి స్ట్రాంగ్‌రూమ్, కౌంటిగ్‌హాళ్లు భద్రతా తదితర చర్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, యువరాజ్, ట్రైనీ ఏఎస్పీ మౌనిక, పాలేరునియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ పి.రాజేశ్వరి, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సిఐ రాజిరెడ్డి, తహశీల్దార్ బి.రాంప్రసాద్, ఎన్నికల డీటీ రవీందర్, ఎంపీఓ రాజారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పుట్టిన రోజు వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. శుక్రవారం 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ సైదబాబు పుట్టిన రోజు వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. అల్లిపురంలోని వారి స్వగృహంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



# పుట్టకోటలో కాటమయ్య విగ్రహ ప్రతిష్ట

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ పుట్టకోటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కాటమయ్య ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో కాటమయ్య విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తజన సందోహం నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రావూరి కరుణ సైదబాబు, కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వర్లు, చావా నారాయణరావు, ఆళ్ల అంజిరెడ్డి, తల్లాడ రమేష్, తుంపాల కృష్ణమోహన్, దిరిశాల వెంకటేశ్వర్లు, నల్లమల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నగరంలోని గొల్లగూడెం రోడ్డు రాఘవయ్య నగర్‌లో గల కనపర్తి వెంకటేశ్వరరావు స్వగృహానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అర్బన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్డిఐవో బ్రాంచీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు.



# ఘనంగా రామాలయ ప్రతిష్టా మహోత్సవం





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండల పరిధిలోని రాంక్యాతండా గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ, బొడ్రాయి, ముత్యాలమ్మ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభం (నాబిశిల) ప్రతిష్టా మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తజన సందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బంధువుల రాకతో ప్రతి ఇల్లు సందడిగా మారింది. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్టా కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి రామసహయం రఘురాంరెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, కార్పొరేటర్లు మలీదు జగన్, కమర్తపు మురళి, స్థానిక నాయకులు షేక్ అఫ్జల్, తేజావత్ వెంకన్న, దరావత్ తారాచంద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన వర్షిత్

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డుకు చెందిన వేమన వర్షిత్ హైదరాబాదులోని జ్వాలా గుప్తా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో శుక్రవారం సత్తాచాటాడు. గత మూడు రోజులుగా జరుగుతున్న పోటీలలో అండర్ 15డబుల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన సిద్దార్థసాయితో కలిసి ఆడి ఇద్దరు ద్వితీయ స్థానంలో నిలిచారు. వర్షిత్‌కు హైదరాబాద్‌కి చెందిన వేమూరి సుధాకర్ మెమోరియల్ ట్రస్ట్ వారు ప్రోత్సాహక బహుమతిగా రూ.13వేలను అందజేశారు. ఈ సందర్భంగా వర్షిత్‌ను కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

# లారీ ఢీకొని మహిళ మృతి




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ప్రమాదవశాత్తూ లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో శుక్రవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సూర్యాపేట జిల్లా,కోదాడ మండలం, గోల్‌తండా గ్రామానికి చెందిన బానోత్ భూరి(58) ఏన్కూర్‌లోని బంధువుల వివాహానికి వెల్లుటకు వరంగల్‌క్రాస్‌రోడ్డులో బస్ కోసం ఎదురుచూస్తుంది. ఈ క్రమంలో మూత్రవిసర్జన కోసం రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న గూడ్స్‌లారీ డ్రైవర్ అతివేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో కిందపడిపోయిన మహిళ వీపుపై నుంచి వెనుక టైర్లు వెళ్లడంతో మృతదేహం నుజ్జునుజ్జయ్యింది. కాగా ఎస్ఐ కుసుకుమార్ ఘటన స్థలానికి చేరుకుని,అన్నంఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడు బానోతు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహ్మద్‌యాకుబ్ పేర్కొన్నారు.

# ఓటరు స్లిప్పుల పంపిణీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పార్లమెంట్ ఎన్నికల కు సంబంధించి పోలింగ్ స్లిప్పులను ఈనెల 30 లోపు పంపిణీ పూర్తి చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య ఆదేశించారు. మండలం లోని మంగాపురంతండా లో శుక్రవారం ఇంటింటికి స్లిప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పోలింగ్ స్లిప్పులను బూత్ లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పంపిణీ కార్యక్రమం ను విజయవంతంగా చేపట్టాలని అన్నారు. స్లిప్పులు పంపిణీలో జాప్యం చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ను ఉల్లంఘిస్తే ఎంతటి వారైన సరే చర్యలు తప్పవని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారి పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌వో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శివ సాయి శ్రీనివాస్ ట్రేడర్స్ షాప్‌ను ప్రారంభించిన కూనంనేని



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాత నగర్ మండల కేంద్రంలో షాపు యజమాని బాలు లక్ష్మి నారాయణ శివ సాయి శ్రీనివాస్ ట్రేడర్స్ షాపును కొత్తగూడెం శాసనసభ్యులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సుజాతనగర్ మండలంలోని పలు శుభకార్యాలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఎంపీపీ భూక్యా పద్మావతి, మండల కార్యదర్శి ధను, సిపిఐ మండల సహాయ కార్యదర్శి, కుమారి హనుమంతూరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, వేల్పుల భాస్కర్ రైతు సంఘం నాయకులు, తాళ్లూరి పాపారావు, తాళ్లూరి ధర్మారావు, తాళ్ళ వెంకటేశ్వర్లు, కుమారి కృష్ణ, ఎంపీటీసీ గణేష్, ఎంపీటీసీ భద్రం, దండు సురేష్, దండు నాగేశ్వరావు, గోపి, జోలెబోయిన కొమరయ్య, బొడ్డు కేశవరావు, భూక్యా తేజ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని బైరవునిపల్లి గ్రామం లో యాదవ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీగంగమ్మ తల్లి, పోతు రాజు స్వామి దేవాలయం కు శుక్రవా రం సంఘం పెద్దలు శంఖుస్థాపన కా ర్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం సభ్యులు సాంప్రాదాయంగా వేడుకగా కార్యక్రమం ను చేపట్టారు. దేవాలయం నిర్మాణం ను శర వేగంగా పూర్తి చేయాలని కమిటి ప్రతినిధులు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ కార్యాలయ స్థలం కబ్జాచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని చిన్నగోపతిలో సిపిఐ కార్యాలయం స్థలాన్ని కబ్జాచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని చిన్నగోపతి సిపిఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొణిజర్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిపిఐ గ్రామశాఖ కార్యాలయం నిర్మాణం కోసం 1995 లో రూ 9 , 500 లు విరాళాలతో గ్రామానికి చెందిన తిప్పర్తి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద స్థలాన్ని కొన్నట్లు తెలిపారు. అప్పడు గ్రామంలో సిపిఐ లో కీలకంగా పనిచేస్తున్న వ్యక్తి సహకారం కూడా ఉందని అన్నారు. కాని ఆవ్యక్తి 2016 సిపిఐ ని వీడి వేరే పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ మారిన తర్వాత ఆ వ్యక్తి స్థలాన్ని అమ్మిన వ్యక్తి వద్దకు వెళ్లి అతనే ఆ స్థలాన్ని కొన్నట్లుగా పత్రాలు సృష్టించి స్థలాన్ని కబ్జాచేశాడని పేర్కొన్నారు. పార్టీ స్థలాని కబ్జాచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కొణిజర్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## బస్వాపురంలో కంఠమేశ్వరుడి గుడి ప్రతిష్ట



**ప్రజాపక్షం/ చింతకాని :** మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో కంఠమహేశ్వరుని గుడి ప్రతిష్ట కార్య క్రమం శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా బస్వాపురం, రామకృష్ణాపురం గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కంఠమహేశ్వరునికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటితో కలిసి రఘురాంరెడ్డి పర్యటన



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచా రశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలో ముమ్మరంగా పర్యటించారు. పోలిశెట్టిగూడెంలో కోదండ శ్రీ రామాలయం, రాంక్యాతండాలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయలలో జరుగుతున్న ప్రాణ ప్రతిష్ట వేడుకలకు హాజరయ్యి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి కైకొండాయిగూడెం చేరుకుని హరితగార్డెన్స్‌లో జరుగుతున్న నాగటి ఉపేందర్ కుమార్తె వివాహానికి హాజరై నూతనవధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా శ్రీ లక్ష్మి చంద్రగార్డెన్స్‌లో కొత్తకొండల్‌రావు కుమార్తె,లక్ష్మి గార్డెన్స్‌లో గుండా దామోదర్‌రెడ్డి కుమారుని వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అక్కడి నుంచి దానవాయిగూడెం చేరుకుని అక్కడ జరుగుతున్న ఓ చిన్నారి ఫంక్షన్‌కు హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్ర మాలలో టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కోకన్వీనర్ ధరావత్ రామ్మూర్తి నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మద్ది కిశోర్ రెడ్డి, పిడమర్తి రవి, మండల అధ్యక్షులు కళ్లెం వెంకట్ రెడ్డి, నాయకులు కన్నేటి వెంకన్న, అజ్మీర అశోక్‌నాయక్, ప్రతాపనేని రఘు, కేకే ఇన్ఫ్రా ప్రోప్‌రైటర్స్ ఖలీల్, ఖదర్ తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి జంక్షన్ సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండల కేంద్రంలో సామా జిక కార్యకర్త ఇందుర్తి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కారేపల్లి రైల్వే జంక్షన్ గురించి దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అతి చిన్న జంక్షన్ ఆదాయంలో అతి పెద్ద రైల్వే జంక్షన్‌గా విరాజిల్లు తున్న కారేపల్లి రైల్వే జంక్షన్ అనేక సమస్యలతో సతమతమ వుతున్నా ఇంతవరకు ఏ ప్రజాప్రతినిధి గాని ఏ రైల్వే అధి కారి గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతేకాకుండా కారేపల్లి రైల్వే జంక్షన్ సమస్యలపై గ్రామస్థులు అనేక సార్లు రైల్వే అధికారులు, పార్లమెంటు సభ్యులకు విన్నవించుకున్నా ఫలితం దక్కలేదు. అందుకే ఈ సారి జరిగే పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల్లో కారేపల్లి జంక్షన్ యొక్క చరిత్ర కారేపల్లి జంక్ష న్‌లో నెలకొని ఉన్న సమస్యలు, కారేపల్లిరైల్వే లైన్‌లో కరోనా సమ యంలో రద్దు చేసిన రైళ్ళ రాకపోకల పునరుద్దరణ, కొత్త రైళ్ళు నడపా లని డిమాండ్ చేస్తూ ఈ మేనిఫెస్టోని రూపొందించడం జరిగింది. ఈసారి జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంటు స్థానం నుండి ఎంపిగా గెలిచిన వారు కారేపల్లి జంక్షన్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంటు స్థానానికి పోటీ చేసే ప్రతి అభ్యర్ధికి ఈ మేనిఫెస్టో అందించడం జరుగుతుంది.

**మేనిఫెస్టోలోని ప్రధాన డిమాండ్లు...**

కారేపల్లి రైల్వే జంక్షన్ పేరును సింగరేణి రైల్వే జంక్షన్‌లాగా మార్చాలి. మణుగూరు–కాజీపేట, కాజీపేట–మణుగూరు మధ్య నడిచే ప్యాసింజర్ రైలును పునరుద్దరించాలి. డోర్నకల్ జంక్షన్–భద్రాచలం రోడ్డు, భద్రాచలం రోడ్డు–డోర్నకల్ జంక్షన్ ప్యాసింజర్ రైలు పునరుద్దరించాలి. విజయవాడ జంక్షన్–భద్రాచలం రోడ్డు, భద్రాచలం రోడ్డు–విజయవాడ జంక్షన్ ప్యాసింజర్ రైలు పునరుద్ద రించాలి. ఇల్లందు–కారేపల్లి జంక్షన్, కారేపల్లి జంక్ష న్–ఇల్లందు ప్యాసింజర్ రైలు పునరుద్దరించాలి. దక్షణి అయోధ్యగా పేరొందిన భద్రాచలం పుణ్యక్షేత్రం నుండి ప్రపంచంలోనే పేరొందిన తిరుపతి పుణ్యక్షేత్రం వరకు భద్రాద్రి ఎక్స్‌ప్రెస్ పేరుతో భద్రాచలం రోడ్డు–తిరుపతి, తిరుపతి–భ ద్రాచలం రోడ్డు స్టేషన్ల మధ్య ప్రతిరోజు రైలు నడపాలి. భద్రాచలం రోడ్డు–సికింద్రాబాద్, సికింద్రాబాద్–భద్రాచలం రోడ్డు స్టేషన్ల మధ్య పగలు సమయాల్లో ప్రతిరోజు ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలి. కారేపల్లిజంక్షన్ రైల్వేలైన్‌లో నడిచే ప్రతి ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళను భద్రాచలం రోడ్డు–డోర్నకల్ జంక్షన్ మధ్యలో గల బేతంపూడి, తడికలపూడి, చీమ లపాడు, గాంధీపురం, కారేపల్లి జంక్షన్, గేటుకారేపల్లి, పోచారం రైల్వే స్టేషన్లలో ఆపాలి. కరోనా సమయంలో కారేపల్లి జంక్షన్‌లో రద్దు చేసిన రిజర్వేషన్ కౌంటర్‌ని పునరుద్దరించాలి. కారేపల్లి రైల్వే జంక్షన్‌ని అమృత్ స్టేషన్ పథకంలో చేర్చి రెండో ప్లాట్ ఫారం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించడమే కాక స్టేషన్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి.

## వడదెబ్బ నుంచి ప్రజలను కాపాడండి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచు కుని వడదెబ్బ నుంచి ప్రజలను కాపాడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. 43వ డివిజన్‌లో జరిగిన సిపిఐ సమావేశంలో సలాం మాట్లాడుతూ కార్మికులు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు నివసించే ప్రాంతాలలో సమృద్ధిగా తాగునీటిని అందించడంతో పాటు వడదెబ్బ రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన తెలి పారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. వడదెబ్బ రక్షణ చర్యల్లో భాగంగా మొబైల్ వ్యాన్లను ఏర్పాటు చేయాలని సలాం కోరారు. ఖమ్మం నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, బోర్లు ఎండిపోతున్నాయని, నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, కలు షిత నీటి సరఫరా కారణంగా ప్రజలు రోగాల బారినపడే ప్రమాదం ఉందని దీనిని అధికార యంత్రాంగం గమనంలోకి తీసుకోవాలని కోరారు. ఎండి రెహ్మాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, నాయకులు జ్వాలా నర్సిం హారావు, ఎస్‌కె చానా, శేఖర్ నాయక్, పిచ్చయ్య, పాండు, దుర్గ, పాషా తదితరులు పాల్గొన్నారు.

## మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్



**ప్రజాపక్షం/ బోనకల్ :** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, డబ్బు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పుతారని బిఆర్‌ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శుక్రవారం బోనకల్ మండలంలోని రాయన్న పేట గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలంతా ఇప్పటికే కాంగ్రెస్ చేసిన మోసాన్ని గుర్తించార న్నారు. రైతులు, పేద మహిళలు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నాటి కేసి ఆర్ ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం మేలు చేస్తుందని ఆశతో ఓట్లు వేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడు స్తున్నా హామీలు నెరవేర్చటంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతు పక్ష పాతి, జిల్లా అభివృద్ధి ప్రదాత బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వర రావు విజయానికి ప్రతిఒక కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని సూచిం చారు. జిల్లా వ్యాప్తంగా నామా గెలుపే లక్ష్యంగా విస్తృతం ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాల న్నారు. నామా గెలుపుతోనే ఖమ్మం జిల్లా అభివృద్ధి సాధ్యమని, పార్ల మెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జున్ రావు, ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, నాయకులు వేమూరు ప్రసాద్, జంగా రవికుమార్, ఇటికాల శ్రీనివాసరావు, జెర్రిపో తుల రవీంద్రర్, కాకాని శ్రీనివాసరావు, గద్దల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎండాకాలం.. జాగ్రత్తలు..!





**ప్రజాపక్షం/మణుగూరు:** ఎండాకాలంలో మనం చాలామంది హీట్ స్ట్రోక్ లేదా సన్ స్ట్రోక్ జరగడం కామన్ గా చూస్తూ ఉంటాం. హీట్ స్ట్రోక్ అధిక ఉష్ణోగ్రతలకు మన శరీరం ఎక్కువ కాలం బహిర్గతం కావడం వల్ల వస్తుంది. సాధారణంగా డీహైడ్రేషన్‌తో కలిపి మనకు ప్రమాదం కలిగిస్తుంది. ఇది మన శరీరం యొక్క ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థ వైఫల్యానికి దారితీస్తుంది. మామూలుగా మన శరీర ఉష్ణోగ్రత 98.4 ఎఫ్ డిగ్రీస్ ఉంటుంది.. హీట్ స్ట్రోక్ యొక్క వైద్య నిర్వచనం 104 ఎఫ్ కంటే ఎక్కువ శరీర ఉష్ణోగ్రత కలిగి ఉండడం, అధిక ఉష్ణోగ్రతలకు గురైతే తర్వాత మన శరీరంలో కేంద్ర నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యలు వస్తాయి. ఇతర సాధారణ లక్షణాలు వికారం, విపరీతమైన చెమట, చల్లగా, పాలిపోయి తేమగా ఉండే చర్మం, వేగవంతమైన, బల హీనమైన పల్స్, వికారం లేదా వాంతులు, కండరాల నొప్పులు, అలసట లేదా బలహీనత, తల తిరగడం, తలనొప్పి, మూర్ఛలు, గందరగోళం, దిక్కుతోచని స్థితి. కొన్నిసార్లు స్పృహ కోల్పోవడం లేదా కోమా. వెంటనే ఏమి చేయాలి?ఎయిర్ కండిషన్ రూమ్ ఉంటే వెంటనే అందులోకి మార్చాలి. చల్లని నీటితో షవర్ బాత్ చేపియ్యాలి. లేదా బాత్ టబ్బులో చల్లని నీళ్లు పోసి అందులో ఉంచాలి. వీలైతే ఐస్ వాటర్ తో తుడవాలి. వెట్ స్పాంజ్ మాపులతో కూడా తుడవచ్చు అనగా చల్లని తడిగుడ్డతో శరీ రాన్ని అంతా తుడవడం. చల్లని బట్టలతో కప్పి ఉంచాలి.. కొంచెం సాల్ట్ తో కలిపిన నిమ్మరసం లాంటిది తాపించండి.. సీరియస్ గా ఉంటే ఆసు పత్రికి తీసుకెళ్లి తే తగిన వైద్యం అందిస్తారు... ఇక రెండవది నీటి విరో చనాలు.. చాలా మటుకు ఫుడ్ పాయిజన్ వల్ల వస్తది. వేసవిలో నీటి ఎద్దడి కారణంగా ఎక్కువగా నీరు కంటమినేషన్ జరుగుతూ ఉంటుంది.. అందువలన కాచి వడబోసిన నీటిని లేదా ఫిల్టర్ వాటర్ ను తాగడం మంచిది. ఎక్కడంటే అక్కడ హోటల్స్ లో భోజనం చేయడం వల్ల కూడా వస్తుంది...10 లేక 15 సార్లు నీటి విరోచనాలు ఎక్కువగా వచ్చి వెంటనే పేషెంట్ డిహైడ్రేషన్‌కు గురి అవుతాడు. ఇటువంటి పేషెంట్స్ కు వెంటనే ఆసుపత్రికి తరలించి అతనికి సెలైన్ పెట్టవలసి ఉంటుంది.. లేకుంటే చాలా మందికి డిహైడ్రేషన్ వల్ల అక్యూట్ కిడ్నీ ఇన్జురి జరుగుతుంది.. మూత్రపిండాలలో సమస్య వస్తుంది. అప్పుడు ఒక్కోసారి ఇది కిడ్నీ ఫెయిల్యూర్ కు దారితీసి ప్రాణాపాయం వచ్చే అవ కాశం ఉంటుంది.. కాచి వడబోసిన నీటిని తాగడం, ఫిల్టర్ వాటర్ తాగడం,బయట ఎక్కడంటే అక్కడ జ్యూసులు తాగడం,, భోజనాలు చేయడం లాంటివి నివారించాలి.. మరియు ఒకటి రెండు విరోచనాలు అవుతానే ఓఆర్ఎస్ పాకెట్స్ తాగడం అలవాటు చేసుకోవాలి.. విరోచ నాలు అవుతూ ఉంటే సత్వర వైద్య సదుపాయం కోసం ఆసుపత్రికి వెళ్లాలి.. ఒక్కొక్కసారి ఇవి చాలా మొండిగా ఉంటాయి.. ఫ్లూయిడ్స్ పెట్టినా గానీ ఆంటీ బయోటిక్స్ మరియు మందులు ఇచ్చిన గాని ఓ పట్టాన లొంగదు.. కావున మనము ముందు జాగ్రత్తగా ఈ సన్ స్ట్రోక్ రాకుండా ఎక్కువ ఎండ ప్రాంతంలో తిరగకుండా ఉండడం ముఖ్యం.. అంతేకాకుండా విరోచనాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# కార్మికులపై పెరిగిన పని భారం

**-తీవ్ర ఉష్ణోగ్రతలకు క్షీణిస్తున్నఆరోగ్యం**
**-గుర్తింపు సంఘం నాయకులు వై రాంగోపాల్**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు పీకే ఓసి లో ఉత్పత్తి కోసం పని భారం విపరీతంగా పెరుగుతుందని గుర్తింపు సంఘం నాయకులు, బ్రాంచ్ సెక్రటరీ వై రాంగోపాల్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మణు గూరు పికె ఓసి 2024 25 టార్గెట్ 104.5 లక్షల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా యాజమాన్యం కార్మికులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తుంద న్నారు. మ్యాన్ పవర్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మ్యాన్ పవర్ లేకపోతే ఉత్పత్తి లక్ష్యం సాధ్యం కాదన్నారు. ఇపీ ఆపరే టర్లు, డ్రైవర్లు టెక్నీషియన్స్, సూపర్వైజర్స్, ఓవర్ మాన్ లు అసిస్టెంట్ మేనేజర్ల తదితర విభాగాలలోతగినంత మాన్ పవర్ లేదన్నారు. దీని కారణంగా తక్కువగా ఉన్న కార్మికుల మీద ఎక్కువ పని భారం పడు తుందన్నారు. కార్మికులు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేయలేక తీవ్రమైన ఎండలకు అలసి పోతున్నా రని ఒకరోజు డ్యూటీకి వస్తే రెండు రోజులు ఆస్పత్రుల పాలవుతున్నా రని ఆయన ఆరోపించారు. సపోర్ట్ ఎక్విప్మెంట్ లేక ఉత్పత్తికి సాధ్యం కావడం లేదన్నారు. సర్వే ఆఫ్ కావడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కో వాల్సి వస్తుందన్నారు. గ్రేడర్‌లు, డోజర్లు సర్వే ఆఫ్ గురయ్యాయని అన్నారు. వాటర్ ట్యాంకులు లేవన్నారు. టైర్లు లేక డంపర్లు బిడి అయి నాయని అన్నారు. ఇలానే కొనసాగితే ఉత్పత్తి లక్ష్యం సాధ్యం కాద న్నారు. మ్యాన్ పవర్ ని నియమించుకోవాలని సపోర్ట్ ఎక్విప్మెంట్‌ని ఏర్పాటు చేసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఇలానే కార్మి కులకు అన్యాయం చేస్తే బాధ్యతాయుతమైన యూనియన్ గా సహిం చేది లేదని హెచ్చరించారు. ఏఐటీయూసీ ఎర్రజెండా కార్మికులకు కష్ట కాలంలో అండగా ఉంటుందని అవసరమైతే ఉద్యమాలు నిర్వ హిస్తామని అన్నారు.

## సింగరేణి ఉద్యోగుల పిల్లలకు క్రీడల శిక్షణ శిబిరం

**డిజీయం (పర్సనల్) యస్.రమేష్**

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో భద్రాద్రి స్టేడియం పివి కాలనీ నందు శుక్రవారం సింగరేణి ఉద్యోగుల బాలబా లికలకు పలు క్రీడలలో శిక్షణ నిమిత్తం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబి రం2024ను ఏరియా డిజియం(పర్సనల్) యస్.రమేష్ చే లాంఛ నంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న డీజీయం( పర్సనల్) ఎస్.రమేష్ మాట్లాడుతూ...క్రీడలు శారీరక ఉత్సా హాన్ని, మానసిక ఉల్లాసాన్ని, చురుకు దనాన్ని, సమయస్ఫూర్తిని నైపు ణ్యతను ఎంతగానో పెంచుతాయన్నారు. పిల్లలు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని మంచి క్రీడాకారులుగా ఎదిగేందుకు ఎంతగానో దోహదప డతాయన్నారు. కావున, సింగరేణి ఉద్యోగులు ఈ ఉచిత శిక్షణ శిభి రంలో 18 సంవత్సరాల్లోపు వయస్సు గల తమ పిల్లలను అధిక సంఖ్యలో చేర్పించడం ద్వారా తమ పిల్లలు మంచి క్రీడాకారులుగా ఎది గేందుకు ప్రోత్సహించాలని తెలిపారు. కావున, సింగరేణి కుటుంబాల బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని తెలియజే శారు. ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏఐటియుసి యూనియన్ నాయకులు




యం.ఈశ్వర్ గారు, ఐఎన్‌టియుసి నాయకులు వి. కృష్ణం రాజు, సీఎం ఓఏఐ అధ్యక్షులు కృష్ణ మూర్తి, డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ కార్యదర్శి యండి మదార్ సాహెబ్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్, స్పోర్ట్స్ మెన్ సురేష్, రాంలాల్, శిక్ష కులు ప్రేమ్ కుమార్, నాగ రాజు, మనోజ్ కుమార్, స్వేతన్, కుమారి పద్మ, అరుణ్ పాల్, బాల బాలికలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు.

## రెండవ దశ ర్యాండమైజేషన్ పూర్తి

**- జిల్లా ఎన్నికల అధికారి డా.ప్రియాంక ఆలా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్ని కల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది 2వ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా తెలిపారు. శుక్రవారం ఐటిఓసి వీడియో కాన్ఫిరెన్స్ సమావేశ మందిరంలో ఎన్నికల వ్యవ నిర్వాహక పరిశీల కులకు రామ్ గోపాల్ కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లా డుతూ జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 962 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 6 కొత్త పోలింగ్ స్టేషన్లు అవసరాన్ని బట్టి రాష్ట్ర ఎన్నికల అధికారికి పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 1162 ప్రిసైడింగ్ అధికారులు, 1162 సహాయక ప్రిసైడింగ్ అధికారులు, 2324 ఓపిఓలును కేటా యించినట్లు చెప్పారు. ఎన్నికల కమీషన్ మార్గ దర్శకాల ప్రకారం అదనంగా సిబ్బంది కేటా యింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ ధారా ప్రసాద్, ఎన్ఐసి డిఓఓ సుశీల్ కుమార్, డిఎల్ఎంటిసి సాయి కృష్ణ పాల్గొన్నారు.

## ఎల్లమ్మగుడి నిర్మాణానికి శంకుస్థాపన.



**ప్రజాపక్షం /గుండాల :** గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన ఎల్లమ్మతల్లి గుడి నిర్మాణ పనులు చేప ట్టేందుకు శుక్రవారం మండల కేంద్రంలోని వారంతపు సంత ప్రాంగణంలో గుడి నిర్మాణం కోసం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించా రు. భూమిపూజ కార్యక్రమంలో గుండెబోయిన నాగరాజు, మొక్క నరేందర్ దంపతులు పాల్గొని వేద పండితుల మంత్రోచరణ నడుమ శంకుస్థా పన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో కుల పెద్దలు బొంగు సిద్దయ్య, బాల్యం రాము, బత్తిని సాయన్న, యాసారపు వెంకన్న, తిరుపతి, మాచర్లక్రిష్ణ, గుండెబోయిన లక్ష్మన్, వై సురేష్, మాచర్ల రాజేష్, మొక్క రాజు, చిన్నరాజయ్య, కుల పెద్దలు పాల్గొన్నారు

## ఇంటర్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్ధులకు అభినందనలు




**ప్రజాపక్షం/ మధిర :** ఇటీవల విడులైన ఇంటర్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్ధులను పలువురు అభినందించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి విభా గంలో 470మార్కులకు గాను 466మార్కు లతో స్టేట్ మూడవ ర్యాంకు సాధించిన మధిర పట్టణానికి చెందిన మామిళ్లపల్లి వర్షను మధిర టౌన్ ఎస్సై సంధ్య అభినందిం చారు. శుక్రవారం టౌన్ పోలీస్‌స్టేషన్ నందు జరిగిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో కష్టపడి చదివి మున్ముందు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తండ్రి మామిళ్ళ పల్లి కృష్ణప్రసాద్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మధిర మండల పరిధిలోని రొంపి మళ్ళ గ్రామానికి చెందిన టి. నాగలక్ష్మి ద్వితీయ సంవత్సరం ఎంపిహెచ్‌డబ్యూ విభాగంగా నందు 1000మార్కులకు గాను 964మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విద్యార్ధినికి రొంపిమళ్ళ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షురాలు గొల్లమందల సునీత, శ్రీనివాసరావు దంపతులు అభినందనలు తెలిపారు.

## వృద్ధాశ్రమంలో అల్పాహారం వితరణ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన గ్రంధి ప్రవీణ్ కుమార్ శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి వైరా మండలం గొల్లపూడి వృద్ధాశ్రమానికి వెళ్లి అక్కడ ఉన్న వృద్ధులకు అల్పాహారాన్ని ప్రవీణ్ కుటుంబ సభ్యులు స్వయంగా అందిం చారు. ఈ సందర్భంగా గ్రంధి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఏదో ఒక రూపంలో సేవా కార్యక్రమా ల్లో భాగస్వాములై వృద్ధులకు చేయూతను అందించాలని ఆయన అన్నారు. తన పుట్టిన రోజు గొల్లపూడి వృద్ధాశ్రమంలో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజలి, రజిని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల అనంతరం కొత్త రేషన్ కార్డులు

## ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రులు పొంగులేటి, తుమ్మల





**ప్రజాపక్షం/దమ్మపేటః** ఖమ్మం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రామ సహాయం రఘురామరెడ్డి విజయాన్ని కోరుతూ మండల పరిధి లోని వడ్లగుడెం శివాలయ ప్రాంగణంలో శుక్రవారం అశ్వారావుపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు మరియు పొంగులేటి శ్రీనివాసరావు రెడ్డి , ఖమ్మం కాంగ్రెస్ పార్టీ పార్ల మెంట్ అభ్యర్థి రామసహయ రఘురామరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సమావేశం లో ఎమ్మెల్యే జారే అది నారాయణ నియోజకవర్గస్థాయిలో ఉన్న కాంగ్రెస్ , సీపిఐ , టిడిపి పార్టీ ముఖ్య నాయుకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశం లో ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ నియోజ కవర్గం లోని ప్రతి కార్యకర్త లు అందరూ రాబోయే ఎన్నికలలో కష్టపడి కలిసిగట్టుగా పని చేయలి అని అన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండకడుతూ కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల గురించి ప్రజల కి వివరిస్తూ ప్రజల ముందుకు వెళ్ళాలని సూచించారు. నాకు గత ఎలక్షన్ లో వచ్చిన మేజారిటీ కంటే కూడా ఎక్కువ మేజారిటీ వచ్చిందని, రాబోయే పార్లమెంట్ ఎలక్షన్ లో ఖమ్మం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురామ రెడ్డికు అంతకంటే ఎక్కువ మెజారిటి రావా లన్నారు . పార్లమెంట్ అభ్యర్థి రామసహయం రఘురామ రెడ్డి మాట్లా డుతూ అందరి సహకారం కావాలని నా గెలుపు మీ గెలుపుగా నాకు సహాయ సహకారాలు అందించాన్నారు. నాకు ఖమ్మం కొత్త కాదు మా నాన్న గారు ఖమ్మం లో ఉన్నారన్నారు. బీజేపీ కేంద్రం లో పరిపాలనలో ఉన్న ఇప్పటి వరకు ఇచ్చిన ఏ హామీ కూడా నేరవేర్చలేదు కానీ, గాస్ మరియు పెట్రోల్ రేటు పెంచారన్నారు. కే ంద్ర ప్రభుత్వ సంస్థలు అమ్ముతున్నారని, గత రాష్ట్ర ప్రభుత్వం కూడా మొత్తం అవినీతిలో కురుకుపోందన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మొదటిగా ప్రతి కార్యకర్తకు శిరస్సు వంచి నమస్కారములు తెలిపారు. ప్రతిపక్ష పార్టీల మీద విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అవినీతిని ప్రజలు ఎండ కట్టాలని, గత ప్రభుత్వ దోపిడిని ప్రజలకు పూర్తిగా వివరించాచా లని, వచ్చే ఈ 14 , 13 రోజులు మన పార్టీ కి చాలా ముఖ్యమైనవి అని ప్రతి కార్యకర్త కూడా కష్టపడాలి అని కార్యకర్తలు మీరు కష్టపడి పనిచే స్తేనే విజయం వస్తుంది అన్నారు, రాహుల్ గాంధీని ప్రధాని ని చేసే కార్యక్రంలో ప్రతి కార్యకర్త భాగం కావాలి అన్నారు రఘురామ రెడ్డి నీ భారీ మెజార్టీ తో గెలిపించాలని అన్నారు. తుమ్మల మాట్లాడుతూ కార్య కర్తలు అందరూ కలిసి గట్టిగా పని చేయలని, ప్రతి కార్యకర్తకు కూడా పార్టీ మేనిఫెస్టో మీద పూర్తి అవగాహన కలిగి వుండి ప్రజలకు వివరిం చాలి అని అన్నారు. మీ ఎమ్మెల్యేకి, కార్యకర్తలకు అభ్యంతరం లేకపోతే ఎవరైనా పార్టీలోకి తీసుకోవచ్చని, అది మీ ఇష్టమన్నారు. రఘురామ రెడ్డి తక్కువ మాట్లాడి, ఎక్కువ పని చేస్తారు అన్నారు. ఈ ఈ సమావేశం లో చిన్నం శెట్టి యుగంధర్, వలీ పాషా, కేవీ సత్యనారాయణ , పగడాల రాంబాబు, కోయల అచ్యుతరావు, కక్కిరాల రమేష్, పర్వతనేని ప్రసాద్ , చక్రాల మలేష్ రావు, రోయల కుమార్, సాయెల నర్సి పాల్గొన్నారు

# నేను పక్కా లోకల్..

## -దొంగ మాటలకు, ప్రలోభాలకు లొంగవద్దు
## -ముల్కలపల్లి ర్యాలీలో బిజెపి అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నేను పక్కా లోకల్ అభ్యర్థినని, ఈ గడ్డ బిడ్డగా ఇక్కడి సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తానని ఖమ్మం పార్ల మెంటు బిజెపి అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. తన స్వగ్రామమైన తిమ్మంపేట గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన వినోద్‌రావుకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ముల్కలప ల్లిలో జరిగిన రోడ్డు షోలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాభివృద్ధికి ఈ భూమి పుత్రుడిగా తాను నిరంతరం పాటుపడతానని హామీ ఇచ్చారు. ఈ గడ్డ బిడ్డగా మీ అభివృద్ధికి నాది భరోసా, మీరు జై శ్రీరాం అని గట్టిగా నినాదాలు చేస్తే తిమ్మంపేట లో ఉన్న మా ఇంట్లో వాళ్లకు కూడా వినిపిస్తుంది. ఈ ప్రాంతం వాడినైన నాకు ఇక్కడి సమస్యలు తెలు సునని, మీరు దీవించి ఢిల్లీ పంపిస్తే మన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. స్థానికేతరుడైన వ్యక్తికి కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఎలా ఇస్తుందని రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేప థ్యంలో తన సొంత మండలంలో తాండ్ర వినోద్‌రావు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. నేను పక్కా లోకల్ బైటి నుంచి వచ్చిన వాళ్లం కాదు మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామ న్నారు. ఎవరెన్ని ప్రలోభాలు పెట్టినా లొంగవద్దని ఓటర్లను అభ్యర్థిం చారు. బిజెపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ రోడ్డు షో కార్యక్రమంలో బిజెపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, నియోజక వర్గ కన్వీనర్ దుర్గా శ్రీనివాస్, పార్లమెంటు కన్వీనర్ నంబూరు రామలింగేశ్వరరావు, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మద్దాల దేవి, వాసం పోలయ్య, ముస లయ్య, శ్రీనివాస్, వెంకటప్పారావు, సీతారాములు, శంకర్, తోట వెంక టేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన



**ప్రజాపక్షం/కల్లూరుః** మే 13వ తేదీ జరిగే పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ పై ఎన్నిక లలో ప్రవర్తన నియమవళి పై అవగాహన కార్యక్రమాన్ని ఉషోదయ మండల సమైక్య కార్యాలయంలో శుక్రవారం వివో ఏలు గ్రామ సమైక్యలకు అవగాహన కార్య క్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్ర మానికి జిల్లా డిఆర్డిఏ ఏపిడి నూరుద్దీన్ మాట్లాడుతూ ఓటు విలువైనదని ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారని దేశ భవిష్యత్తు మనపై ఉందని మంచి నాయకుని ఎన్నుకునే హక్కు ఓటు ద్వారా ఉందని తమకు ఇష్టమైన వ్యక్తిని ఎన్నుకునే అవకాశం ద్వారా మనకు మంచి అవకాశం ఉందని ప్రజాస్వామ్యం అమ్ముడు పోయే ఆట వస్తువు కాదని ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని గ్రామాలలో మద్యం నగదు పంపిణీ చేస్తున్నట్లయితే సి విజిల్ యాప్ ద్వారా సమాచారాన్ని అందిస్తే త్వరితగతిన అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు .మహిళలు గ్రామా లలో చైతన్యవంతులను చేసే బాధ్యత గ్రామ సమైక్యలు వివో ఏలదేనని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రవర్తన నియమా వళి నమూనా ఉల్లంఘనను సి విజిల్ యాప్ ద్వారా అరికట్టవచ్చని మొబైల్ ఫోన్ ద్వారా యాప్ ను డౌన్లోడ్ చేసుకొని ఫిర్యాదును ఎన్ని కల అధికారులకు తెలియపరిస్తే మద్యం నగదు బహుమతులు ప్రధానం లాంటిది అరికట్టడానికి ఈ యాప్ సహ కరిస్తుందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేం దుకు నిర్వహణకు ప్రతి మహిళ సహకరించాలని ఆయన ఈ సంద ర్భంగా మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ పులి సాంబశివుడు, ఎస్సై షాకీర్, ఎంపీడీవో చంద్రశేఖర్, డిపిఎం శ్రీనివాస రావు, డిఎంజి జనార్ధన్, ఏపీఎం వెంకట్రామారావు, ఉషోదయ మండల సమైక్య అధ్యక్షురాలు నిర్మల, గ్రామ సమస్యలు, సీసీలు పాల్గొన్నారు.

# ఎంపిలు వద్దిరాజు, నామ వాహనాల తనిఖీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ అభ్యర్థి నామ నాగేశ్వరరావు లు ప్రయాణిస్తున్న వాహనాలను పోలీసులు శుక్రవారం తనిఖీ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం, పాల్వంచ నుంచి అశ్వారావుపేట నియోజక వర్గం ములకలపల్లి వెళ్తుండగా మార్గ మధ్యలో మాదారం వద్ద పోలీసులు ఆపి వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీలకు ఎంపిలు వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు లు సహకరించారు.

# విద్యుత్ ఉపకేంద్రంలో ఉష్ణోగ్రతల తనిఖీ



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండిలోని విద్యుత్ ఉపకేంద్రంలో ఎన్పీడీసీఎల్ వరంగల్ సి ఈ చౌహన్ ఎస్సీ ఈ సురేంద్ర, రాములు కన్స్ట్ర క్షన్ ఏ ఈరఘుపతి రెడ్డిలు ఉపకేంద్రంలలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తీవ్రతను బట్టి థర్మల్ కెమెరాతో పరీక్షిం చారు. ఎండ తీవ్రతను వేడిమినిబట్టి ఎలాంటి సంఘటనలు జరగకుండా ఇబ్బందులు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు స్థానిక అధికారి తిరుపతయ్యకు శుక్రవారం ఆదేశాలు ఇచ్చారు. ఉపకేంద్రం నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మత్స్యకారుడు కుటుంబంలో చదువుల సరస్వతి

## -ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు
## -ఘనంగా సన్మానించిన మత్స్యకారుల సంఘం అధ్యక్షులు షేక్ రహీం



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలో లాలాపురం గ్రామానికి చెందిన షేక్ సైదు హుస్సేన్, షేక్ హుస్సేన్‌బి దంపతులు జీవనోపాధి మత్స్యకారులుగా జీవనం కొనసాగిస్తున్నారు. వీరి కుమార్తె షేక్ షహనాజ్ బేగం, మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజ్ కారేపల్లిలో ఇంటర్ ప్రధమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను 462 మార్కులు సాధించింది. ఈ మత్స్యకారుడు కుటుంబంలో కూతురు సాధించిన మార్కులు చూసి తండ్రి ఎంతో ఆనందపడ్డాడు. అదేవిధంగా మత్స్యకారుడు కుటుంబాలు అందరూ కూడా అభినందించారు. మత్స్యకారుల సంఘ నాయకులు వైరా రిజర్వాయర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు షేక్ రహీం, షహనాజ్‌బేగంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లాలాపురం గ్రామానికి చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు.

# ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది

## -సత్తుపల్లి, అశ్వారావుపేటలో నామ ప్రచారం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అలవి కాని హామీలు ఇచ్చి ప్రజ లను మోసం చేసి కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చిందని ఎంపి వద్ది రాజు రవిచంద్ర, ఖమ్మం బిఆర్ ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు లు తెలిపారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అశ్వారావు పేట, ముల్కలపల్లి, సత్తుపల్లి మండలాల్లో నామ నాగేశ్వరరావు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ లను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. రైతుబంధు, కళ్యాణలక్ష్మి తో పాటు తులం బంగారం, మహిళలకు రూ. 2500, రుణమాఫీ వంటి ఎన్నో హామీలను నెరవేర్చలేదన్నారు. పార్లమెంటులో నామ నాగేశ్వరరావు తెలంగాణ హక్కుల కోసం పోరాడారన్నారు. రాబోయే ఎన్నికల్లో నామను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థిని నిన్నటి వరకు ప్రకటించ లేదని ఆయన ఏ ప్రాంతానికి చెందిన వారో కూడా ఎవరు చెప్పలేక పోతున్నార న్నారు. నామ లోకల్ అభ్యర్థి అని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరి ష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎలు రేగా కాంతారావు, మెచ్చా నాగే శ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, తాటి వెంకటేశ్వర్లు, మాజీ డిసిసిబి ఛైర్మన్ కూరాకుల నాగ భూషణం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి పరీక్ష కిట్లు సరే.. చేసేదెక్కడ..?



**-ఖమ్మం జిల్లాలో 589 పంచాయతీలు**
**-కనిపించని నీటి పరీక్షలు ట్యాంక్‌లు శుభ్రం**
**-కార్యదర్శుల్లో కనిపించని నీటి పరీక్షలు**
**-కలుషితం అవుతున్న తాగునీరు**
**-ప్రజల ఆరోగ్యానికి ముప్పు**



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లాలో 589 గ్రామపంచాయతీలు ఉన్నవి. గ్రామీణ ప్రాంతాల్లో కలుషితమైన నీటితో ప్రజలకు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం ప్రజలకు పరిశుభ్రమైన శుద్ధజలం అందించాలని లక్ష్యంగా పెట్టుకొని నీటిని పరీక్ష చేసే కిట్లను ఖమ్మం జిల్లాలో 589 గ్రామపంచాయతీలకు ప్రభుత్వం అందించింది. గ్రామపంచాయతీలకు త్రాగునీటి సరఫరా అయ్యే పైప్‌లైన్‌లు మధ్యమధ్యలో లీకేజ్ కావడం పగిలిపోవడం ఎయిర్ వ్వా పాడైపోవడంతో సరఫరా అయ్యే త్రాగునీరు కలుషితమవుతుంది. దీంతో స్వచ్ఛమైన శుద్ధ జలం ప్రతి గ్రామపంచాయతీలోని ప్రజలకు అందించేందుకు గ్రామపంచాయతీకి ఒక త్రాగునీటి పరీక్షలు చేసేందుకు కిట్లను అందించారు. ప్రతి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన త్రాగునీటి పరీక్షలు కిట్లను అధికారులు పంచాయతీలకు పంపించారు. గ్రామపంచాయతీ క్యాదర్శుల సమక్షంలో పంపు ఆపరేటర్లు నీటి పరీక్షలు చేయాల్సి ఉంది. కాని తీసుకొచ్చిన నీటి పరీక్షలు పరికరాలు కిట్లు కేవలం పంచాయతీలకే పరిమితం అవుతున్నాయని ఆరోపణలు లేకపోలేదు. పంచాయతీలకు వచ్చిన త్రాగునీటి పరీక్ష కిట్లు గురించి పట్టించుకున్న నాధుడే లేదు. కొన్ని గ్రామపంచాయతీల్లో కొంతమంది పంపు ఆపరేటర్లు వయోభారంతో ట్యాంకులు ఎక్కలేకపోతున్నారు. మరికొంతమంది ట్యాంకులు చూడటం లేదు. దీంతో ట్యాంకులు శుభ్రపరచకుండానే కలుషితం అవుతున్న నీటి సరఫరా జరుగుతూ ఉంది. కనీసం ప్రతి గ్రామపంచాయతీలో త్రాగునీటి వాటర్ ట్యాంకులను కూలీలను ఏర్పాటు చేసుకొని శుభ్రపరుచుకోవాల్సిన పని ఉన్నప్పటికీ కొంత మంది అలా కూడా చేయడం లేదని విమర్శలు లేకపోలేదు. ప్రజలు త్రాగే త్రాగునీరు పట్ల ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గ్రామాలకు వస్తున్న మిషన్ భగీరథ త్రాగునీటిని తరచుగా పరీక్షించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే సరఫరా అవుతున్న త్రాగునీరు త్రాగడానికి పనికొస్తుందా ఏదా అనేది నీటి పరీక్షల ద్వారా స్పష్టమవుతుంది. నీటిని పరీక్షించిన అధికారులు నీటిలో నాణ్యతే లేదని తెలిస్తే ఆ నీటిని సరఫరా చేయకుండా ఆపి ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. శుద్ధజలం చేసిన త్రాగునీరును గ్రామాలకు అందించాలని ప్రజలు కోరుతున్నారు. శుద్ధిచేసిన మిషన్ భగీరథ త్రాగు నీరు సరఫరా చేస్తున్నప్పటికీ లీకేజీలతో త్రాగు నీరు కలిసి తమయే అవకాశం ఎక్కువగా ఉంది. ఆ నీరు ట్యాంకుల్లోకి చేరి ఇల్లకు సరఫరా జరిగి కలుషితమయ్యే అవకాశం ఉంది. దీంతో ప్రజలు అనారోగ్య సమస్యలకు లోనై పరిస్థితి ఏర్పడుతుంది. ఒక ప్రణాళికతో ట్యాంకులు శుభ్రం చేయించి క్లోరినేషన్ చేసేలా ప్రతి గ్రామపంచాయతీలో అధికారుల పర్యవేక్షణ ఉండాలి. ప్రభుత్వాలు అందిస్తున్న నీటి నాణ్యత కిట్ల ద్వారా ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేసి ప్రజలకు శుభ్రమైన నీరు సరఫరా చేయించాల్సిన అవసరం ఉన్నప్పటికి వాటిని పరీక్షించే వారే కరువయ్యారు. మంచినీటి పరీక్షలపై కార్యదర్శులు పంపు ఆపరేటర్లకు అధికారులు ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వాలి. వారి ద్వారా నీటి పరీక్షలు చేసి శుభ్రమైన నీటి సరఫరా చేసే ప్రజలు ఆరోగ్యం కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# అక్కడి మావోలు.. ఇక్కడ లొంగుబాటు..!



**- సిజి మావోల లొంగుబాట్లపై భిన్న కథనాలు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు తెలుగు రాష్ట్రాల్లో లొంగిపోతున్నారు. తాజాగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం ఎస్‌పి రోహిత్ రాజ్ ఎదుటు ఇద్దరు లొంగిపోగా,గడిచిన మూడు రోజుల క్రితం ఏపిలోని విశాఖ డిజిపి విశాల్ ఎదుట ఆరుగురు మావోయిస్టులు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మావోయిస్టుల వేట పెరిగింది. మరో ప్రక్క ఆకు రాలే కాలం కావడం, పెద్ద ఎత్తున బలగాలు అడవుల్లోకి వెళ్లి అందిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో గడిచిన నాలుగు మాసాల్లో ఏకంగా 79 మంది మావోయిస్టులు నేలరాలడం ఇందుకు నిదర్శనం. తాజాగా అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 29 మంది మావోయిస్టులు హతం మయ్యారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతి పెద్ద నష్టం భావిస్తున్నారు. దీంతో ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న మావోయిస్టులు ఎన్నికల వేళ ఏదో ఒక చర్యకు పాల్పడి భయానక వాతావారణాన్ని కల్పిస్తారని భావించిన అక్కడి ప్రభుత్వం మరింత మందిని అడవులను జల్లెడ పట్టేందుకు పంపించింది. అబూజ్‌మండ్ లాంటి ప్రాంతాల్లోకి చొచ్చుకు పోతున్న బలగాలు ఎన్‌కౌంటర్లు చేస్తూ సఫలీకృతం అవుతున్నారు. దట్టమైన అడవులు, అత్యంత రహస్యమైన స్థావరాలు,అతిపెద్ద కొండచెరియలు ఉన్న ప్రాంతాల్లోకి సైతం సైన్యం చొచ్చుకుపోతుండటంతో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో లొంగుబాట్లు పెరిగినట్లు భావిస్తున్నారు.

**భిన్న కథనాలు...**

ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులు తెలుగు రాష్ట్రాల్లో లొంగిపోవడం వెనుక భిన్న కథనాలు వినవస్తున్నాయి. అబూజ్‌మడ్ వంటి ప్రాంతాలు సైతం చేజారి పోతుండటంతో ఉనికి కోల్పోయి లొంగిపోతున్నట్లు ప్రచారం సాగుతోంది. మరో ప్రక్క తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లో లొంగిపోతే ప్రాణాలు కాపాడుకోవడంతో పాటు వారిపై ఉన్న రివార్డులను సులువుగా దక్కించుకోవచ్చనే ఉద్దేశ్యంతో లొంగిపోతున్నట్లు ప్రచారా సాగుతోంది. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు కావాలనే కొంతమందిని లొంగిపోవాలని ఆదేశించినట్లు, ఇలా లొంగిపోవడం ద్వారా మావోయిస్టు పార్టీ ఉనికి పూర్తిగా కోల్పోయిందని భావించి బలగాల గాలింపులు తగ్గుతాయని భావించి ఈ లొంగుబాట్లు చేయిస్తున్నట్లు మరో ప్రచారం ఉంది.

**జిల్లా ఎస్‌పి ఎదుట...**

శుక్రవారం జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్ ఎదుట ఇద్దరు మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాంలోని సుకుమా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల నెమలిగూడ ప్రాంతానికి చెందిన మిలీషియా సభ్యుడు పోడియం ఇడుమయ్య అలియాస్ హరీష్, ఇదే ప్రాంతానికి చెందిన ఉయికే సమ్మక్క అలియాస్ సావిత్రి డివిసిఎం ఐసి కిష్టారం ఏరియా కమిటీ సభ్యురాలు లొంగిపోయిన వారిలో ఉన్నారు. ఇదిలా ఉండగా గడిచిన కొద్ది రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ రేజ్ డిఐజి విశాల్ ఎదుట విశ్లేష్ అలియాస్ రాజ్, బరిసే మూస, వెట్టి భీమ, వంగం రామి అలియాస్ కమల, మడకం సుక్కి, మడకం సోని లు లొంగిపోయారు. నిషేద మావోయిస్టు పార్టీని వీడి జనజీవన స్రవంతిలోనికి వచ్చే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తుందని పోలీసులు ప్రకటిస్తున్న ప్రకారం వారికి పునరావాసాన్ని కల్పిస్తున్నారు. మరో ప్రక్క మావోయిస్టు పార్టీకి ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా సహకరించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా చర్ల సమీప అటవీ ప్రాంతాల్లో ఈ గిరిజన యువకులు మావోయిస్టులకు ఆకర్షితులు కాకుండా ఉండేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. గిరిజనులతో మమేకమే మావోయిస్టులుగా ఉన్న తమ వారిని లొంగిపోవాలని చెప్పమంటూ చెబుతున్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ డిజిపి రవిగుప్తా సోమవారం చర్ల సరిహద్దుల్లోని పూసుగుప్ప, ఉంజుపల్లి, చెన్నాపురం సిఆర్‌పిఎఫ్ క్యాంపులను పరిశీలించి అక్కడి జవాన్లతో మాట్లాడిన విషయం తెలిసిందే. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు చేపడుతున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమం సత్ఫలితాలు ఇసున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో లొంగుబాట్లపై భిన్న కథనాలు వినవస్తున్నాయి.

# రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో జరిగే పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, ఖమ్మం పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, ఖమ్మం పార్లమెంటు రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్, పార్లమెంటు ఎన్నికల సాధారణ పరిశీలకులు డా॥ సంజయ్ జి కోల్టేతో కలిసి పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ లో అసెంబ్లీ సెగ్మెంట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1459 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటికి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఓపివోలను కేటాయించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 20 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 355 పోలింగ్ కేంద్రాలకు పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 290 పోలింగ్ కేంద్రాలకు మధిర అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 268 పోలింగ్ కేంద్రాలకు, వైరా అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 216 పోలింగ్ కేంద్రాలకు, సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 294 పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, శిక్షణ సహాయ కలెక్టర్‌లు మయాంక్ సింగ్, మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, కలెక్టరేట్ ఏవో అరుణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు భరోసా కల్పించడం కోసమే ఫ్లాగ్ మార్చ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునే విధంగా భరోసా కల్పించడం కోసమే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు రఘునాథపాలెం సిఐ టి. శ్రీహరి తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి సారధ్యంలో రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని రఘునాథపాలెం, చింతగుర్తి, ఈర్లపుడి తదితర గ్రామాల్లో సెంట్రల్ పోలీస్ ఫోర్స్, స్థానిక పోలీస్ సిబ్బంది తో కలిసి శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలుగకుండా పార్లమెంటు ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టినట్లు తెలిపారు. సెంట్రల్ పోలీస్ ఫోర్స్ స్థానిక పోలీస్ సిబ్బంది తో కలిసి కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రలోభాలకు గురికాకుండా నచ్చిన వ్యక్తికి ఓటు వేసే ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్రమ మద్యం, నగదు, కానుకల రవాణాకు చెక్ పెట్టేందుకు చెక్ పోస్టుల ద్వారా తగు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, బ్లూ కోల్ట్ బృందాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు.

## డోర్నకల్ గద్వాల్ రైల్వే లైన్‌ను వ్యతిరేకిస్తూ

# బాధిత రైతుల ఆందోళన





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో దక్షిణ మధ్య రైల్వే శాఖ డోర్నకల్ జంక్షన్ నుండి సుమారు 267 కిలోమీటర్ల మేర గద్వాల్ వరకు రైల్వే లైను నిర్మించేందుకు రైల్వే శాఖ అధికారులు భూ సర్వే నిర్వహించారు. పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మ రూరల్ తిరుమలయపాలెం కూసుమంచి మండలాల నుండి రైల్వే లైను వెళ్తుండగా వేల హెక్టార్ల వ్యవసాయ భూమి కోల్పోవాల్సి వస్తుందని కొక్కిరేణి సమీపంలోని అధికారులు రైల్వే లైన్ కోసం మార్కింగ్ చేసిన ప్రదేశంలో వందలాది మంది బాధ్యత రైతులు ఖమ్మం వరంగల్ జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో ఖమ్మ రూరల్ 20 కిలోమీటర్లు తిరుమలాయపాలెం మండలం 6 కిలోమీటర్లు కూసుమంచి 10 కిలోమీటర్లు సుమారు 36 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ లో సుమారు 1500 ఎకరాల్లో వ్యవసాయ భూమి కోల్పోతుందని ఈ రైల్వే లైన్ ను వెంటనే నిలుపుదల చేయాలని ఈ రైల్వే ట్రాక్ వల్ల ఈ ప్రాంత రైతులకు గాని ప్రజలకు గాని ఎలాంటి ఉపయోగం లేదని కేవలం వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి గుత్తేదారుల జేబులు నింపడానికేనని వారి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక మంత్రులు ఈ లైన్ ని వ్యతిరేకిస్తూ కేంద్ర రైల్వే శాఖకు నివేదిక ఇవ్వాలని వాడు కోరారు. లేనియెడల న్యాయస్థానాన్ని ఆశ్రయించి రైల్వే లైను అడ్డుకుంటామని దశలవారీగా రైల్వే లైన్ ను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సాదిక్ ఆలీ, ముత్యం ఉప్పల్ రావు, తోట జగన్, చింతలపూడి శ్రీను, గంట కృష్ణ, ఇంటూరి వెంకటేశ్వర్లు, బెల్లం శ్రీనివాస్, చావా వెంకట్రావు, తోట శ్రీనివాస్, సుడిగాలి వెంకటేశ్వర్లు, మల్లెల పాపారావు, ఉపగండ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లేపల్లిలో ఆలయాల ప్రతిష్ట వేడుకల్లో మంత్రి పొంగులేటి, రఘురాంరెడ్డి



**ప్రజాపక్షం/కూసుమంచి :** మల్లేపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ సీతారామ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ ఖమ్మం లోక్ సభ అభ్యర్థి రామ సహా యం రఘురాం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల వేదాశీర్వచనం పొందారు. అనంతరం ఇదే గ్రామంలో గంగమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ వేడుక కు హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, నాయకులు నెల్లూరి భద్రయ్య, బజ్జూరి వెంకటరెడ్డి, జొన్నలగడ్డ రవి, రామ్మూర్తి నాయక్, హఫీజ్ ఉద్దీన్, కొప్పుల చంద్రశేఖరరావు, శ్రీనివాసరెడ్డి, తమ్మినేని నవీన్, సూర్య నారాయణ రెడ్డి, పెంద్ర అంజయ్య, సెట్ రామ్ నాయక్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం** వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమయం పాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డా. శిరీష హెచ్చరించారు. శుక్రవారం ఆమె గుండాల మండల పరిధిలోని రొంపే డు, కొమరారం పిహెచ్‌సిలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని ఆరోగ్య కార్యక్రమాలను వంద శాతం అమలు చేయాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా అన్ని పిహెచ్‌సీల పరిధిలో వడ దెబ్బ నివారణ చర్యలు తీసుకోవాలని, వేసవి తీవ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఇల్లెందు పిహెచ్‌సి లో డా. సుకృత తో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.బాలాజీ నాయక్, వైద్యాధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రహదారిని మూసివేసే అర్హత అటవీ అధికారులకు లేదు



**-మున్సిపల్ కమీషనర్‌కు ఫిర్యాదు చేసిన సిపిఐ నేతలు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** పలు కార్యాలయాలు, బ్యాంకులు, అఫీసులకు వెళ్లే ప్రధాన రహదారిని మూసివేసే అర్హత పాల్వంచ అటవీ అధికారులకు లేదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం ప్రశ్నించారు. శుక్రవారం పాల్వంచలోని ఫారెస్టు రోడ్‌లో బారికేడ్లతో అటవీ అధికారులు రహదారి మూసివేయటంతో పరిశీలించి స్థానికులతో కలిసి మున్సిపల్ కమీషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల్వంచ పంచాయితీ కాలనీ నుండి ప్రజల నిత్యం తమ పనుల మీద ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారని, అటవీ అధికారులు తమ ఇష్టాను సారంగా రహదారిని మూసివేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారుల తీరుపై కలెక్టర్, స్థానిక ఎంఎల్ఏకు ఫిర్యాదు చేయబోతున్నట్లు చెప్పారు. వెంటనే రహదారిని పునరుద్ధరించాలని, లేదంటే ప్రత్యక్ష పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పాల్వంచ మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, దుర్గరాల సుధాకర్, పద్మజ, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, గాలి పద్మ, లక్ష్మి, ఎస్‌కె పాషా, జకరయ్య, వైఎస్ గిరి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి కళ్యాణ మండపం రీమోడలింగ్ పనులకు పూజలు



**ప్రజాపక్షం/వైరాః** వైరాలో వాసవి కళ్యాణ మండపంలో జరిగే ఫంక్షన్‌కు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వాసవి కళ్యాణ మండపం ఏసి ఫంక్షన్ హాల్‌ను రీమోడలింగ్ చేయనున్నట్లు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు తెలిపారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఫంక్షన్ హాల్ గ్రౌండ్ ఫ్లోర్ భాగాన్ని రీమోడలింగ్ చేసి ప్రజలకు మరిన్ని సౌకర్యాలతో మెరుగైన వసతులు అందించేందుకు పనులు ప్రారంభం చేయడానికిగాను పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈపూజా కార్యక్రమంలో ఆర్యవైశ్య వైశ్య సత్రం అధ్యక్ష కార్యదర్శులు సభ్యులతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మండపం అధ్యక్షులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, పద్మావతి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభం చేసినందుకు ముహూర్తాన్ని ఖరారు చేశారు. త్వరలోనే రీమోడలింగ్ పనులు ప్రారంభమై అన్ని రకాల వసతులతో ప్రజలకు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య సత్రం కార్యదర్శి నూకల వాసు, మిట్టపల్లి నాగి, మిట్టపల్లి సత్యంబాబు, నూకల ప్రసాద్, వజినేపల్లి చక్రవర్తి, కొమ్మిశెట్టి శ్రీధర్, రాయల జగదీష్, మిట్టపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిద్దాం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గత 10 సంవత్సరాలుగా దేశంలో మత విద్వేషాలు వేగంగా వ్యాప్తి చెందడం వల్ల ముస్లిం మైనార్టీ సమాజంతో పాటు ఇతర స్థానికులు కూడా దేశ వ్యాప్తంగా అభద్రతా భావానికి గురవుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు, మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల పరిశలకులు మహమ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం వల్ల ఎక్కువ నష్టాలు చవి చూడాలంటే కేంద్రంలో సెక్యులర్ పార్టీల ప్రభుత్వం అవసరమని, దీని కోసం కాంగ్రెస్ నేతృత్వంలోని భారత కూటమిని అధికారంలోకి తీసుకురావడం దేశానికి మేలు చేస్తుందన్నారు. దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో శరవేగంగా విస్తరిస్తున్న మతతత్వ వాదాన్ని అరికట్టాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, మతతత్వాన్ని ఓడించేందుకు ప్రతి పాదిత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, అఖిలపక్ష పార్టీలను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో భాజపాను ఓడించగల ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. భారతదేశంలో నిర్మించడంలో వంతు పాత్ర పోషించాలని ముస్లిం సోదరులను పండితులను మైనార్టీలను అభ్యర్థించారు. ముఖ్యంగా మైనారిటీ కమ్యూనిటీ వారి ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచాలని, తక్కువ ఓటింగ్ కారణంగా కమ్యూనల్ భారత్ లేదా జనతా పార్టీ అభ్యర్థులు లబ్ధి పొందుతారనే ఆందోళనలు ఉన్నాయని, మైనారిటీ కమ్యూనిటీ దానిని తొలించడం చాలా ముఖ్యమని అన్నారు.

## కల్లూరులో ఓటరు చైతన్య యాత్ర



**ప్రజాపక్షం/కల్లూరుః** చెన్నూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు దంతాల సుధాకర్ ఓటరు చైతన్య బైక్ యాత్రను తహశీల్దార్ పులి సాంబశివుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఓటరు చైతన్య యాత్ర సుధాకర్ జిల్లా మండల వ్యాప్తంగా చేసే ఓటింగ్ శాతాన్ని పెంచుటకు ఈ యాత్ర చేయడం పట్ల సుధాకర్‌ను మండల శాఖ అధికారులు ఎంపీడీవో చంద్రశేఖర్ లు అభినందించారు. ఈ యాత్ర పార్లమెంట్ ఎన్నికల వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా తో పాటు మండలంలో అన్ని గ్రామాలలో ఈ యాత్రను చేపడుతున్నట్లు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్, కార్యాలయసిబ్బంది తో పాటు పలువురు పాల్గొన్నారు.